# నాకూ పద్మశ్రీ కావాలి

వేమూరి రామశేషశర్మ

నేను వ్యాపారిని. నా వద్ద చాలా మంది పని చేస్తారు. నా వద్ద వారు పనిచేస్తారనడం కంటె నేనే వారికి పని యిస్తాననడం న్యాయం. అవును మరి, ఉద్యోగాలు దొరకని యీ గడ్డు రోజులలో ఎంతోమందికి పని కల్పించానంటే, అది నా ఉదారత కాక మరేమి అవుతుంది?

అయితే నేను చేసే వ్యాపార మేమిటని అడగకండి. నేను చేయని పని అంటూ కనపడదు. వస్తువులను ఉత్పత్తి చేయటం మొదలు వాటిని విక్రయించే బాధ్యత లన్నింటినీ స్వీకరిస్తాను. అయితే నన్నొక్క విక్రేతగా మాత్రమే భావించకండి. నేను రాజకీయాలలో ముఖ్యపాత్ర వహిస్తాను. నేను రాజకీయాలలో తలమార్చినట్లు చాలామందికి తెలియదు. ధనమూలమిదం జగత్! డబ్బుతో సాధ్యం కానిదంటూ ఉండదు (నాకు) నేను ఏ రాజకీయపార్టీకి (Political Party) చెందిన వాడను కాను. కానీ ఒకటిమాత్రం నిజం. అధికారములోనున్న పార్టీలోని కొందరిని నా చుట్టూ తిరుగునట్లు చేసుకుంటాను. అదెట్లు సాధ్యమని ప్రశ్నించవద్దు. ఆ విషయం పైనే చెప్పాను. వారి ద్వారా దేశపుటార్థిక విధానాన్ని నాకు అనువుగానుండునట్లు మలుచుకుంటాను. దీనిని బట్టి నేను దేశంయొక్క ఆర్థిక విధానానికి మూల స్తంభాన్నన్న విషయం గమనించండి. సరే రాజకీయాల సంగతి అలా ఉంచండి. దేశమెదుర్కొంటున్న ముఖ్య సమస్యలలో జనాభా సమస్య ఒకటి. దీనిని పరిష్కరించేందుకు నా శక్తికొలది ప్రయత్నిస్తూనే ఉన్నాను. నేను అమ్మే వస్తువులు చాలామటుకు స్వచ్ఛమైనవి కావు. మిరియాలలో బొప్పాయిగింజలు, సాంబారు పొడిలో Horse dung, కారంలో రాతిపొడి, కాఫీ పొడిలో చింతగింజల పొడి, బియ్యములో రాళ్ళు, పాలలో నీళ్ళు, నేతిలో వనస్పతి, ఒకటేమిటి నేను చేయని మిశ్రమ మంటూ లేదు. నేనమ్మే మందులన్నియు కల్తీవే. ఈ వస్తువులను వాడిన ప్రజలు బలహీనులై, త్వరలో యమలోకమును చేరుకుంటారు. దీనివల్ల కొంత జనాభా తగ్గుతుంది కదా; ఇది నేను జనాభా పెరుగుదలను అరికట్టుటకై చేయు పని. ఇందులో స్వలాభాపేక్ష కొంచమైనాలేదు. కాని నేనంటే గిట్టని వారు మాత్రము నన్ను దొంగ వ్యాపారినని దుయ్యబడుతారు. ఇది ఏమి న్యాయము? ప్రభుత్వము చేయలేని పనిని సునాయాసముగా చేయునందులకు నన్ను అభినందిచక. నిందించుట సమంజసమా?

అయితే మితిమీరిన లాభాలను గడిస్తానని నేనంటే చాలామందికి అసహ్యం. ఇందులో నా తప్పు కనపడదు_ కొన్ని సమయాలలో రూపాయకు పైసే లాభం తీసుకుంటాను. అయితే రూపాయకు రూపాయి లేక రెండు లాభం తీసుకున్న సందర్భాలు లేకపోవు. అధిక లాభాన్ని ఎందుకు పుచ్చుకుంటానో ఆలోచించేవారు లేరు. మీరు నా గురించి ఆలోచించకపోయినా, నేను చేయు పనిని సవివరముగా మీకు మనవి చేసుకొమట నా విద్యుక్త ధర్మము. ఆహార ధాన్యాల ధరలను పెంచినపుడు, ప్రజలలో అల్లకల్లోలం బయలుదేరుతుంది. దేశములో ఆహార ధాన్యాల నిల్వలు తగ్గినవని తెలియును. దీనికి కారణం పంటలు పండలేదని తెలుస్తుంది. దీనితో ప్రభుత్వము పంటలను అధికముగా పండించవలసిన ఆవశ్యకతను గుర్తించి, తగు చర్యలు తీసుకుంటుంది. వాతావరణ

సూచనకు "భారమితి" చేయు పని ఎటువంటిదో, తత్సంబంధమైన పనినే నస్తువుల నిల్వల సూచనకు నేను చేస్తాను. బాగా నిల్వలు ఉన్నప్పుడు కృత్రిమ కొరతను ఏర్పరచి, ధరలను అధికము చేయననటం లేదు. ఈ కృత్రిమ కొరతను కల్పించుటవలన ప్రభుత్వము ఎప్పుడూ అప్రమత్తతో వ్యవహరిస్తుందనే ఉద్దేశమే కాని, తదన్యము కాదని మీరు గ్రహిస్తే నేను ధన్యుణ్ణి.

నాకు వచ్చిన లాభాలకు ఇన్‌కం టాక్స్ కట్టనని, నా దగ్గర బ్లాక్‌మనీ ఉందనీ ఆడిపోసుకుంటారు. నిజమే బ్లాక్‌మనీ నా దగ్గర లేదనటం లేదు. ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ ఉందికదా! అది పూర్తిగా, శక్తివంతముగా పనిచేయాలంటే, వచ్చిన ఆదాయముపై సక్రమముగా కనుక పన్ను చెల్లిస్తే, అప్రమత్తతో నుండక, మందకొడిగా పనిచేస్తుంది. ఒక పిల్లిని పెంచుతూ (ఎలుకను పట్టటం కోసం) దానికి కడుపునిండా పాలుపోస్తే అది ఎలుకలనుపడుతుందా? అందుకే నేను (నాలా చాలామంది) ఇన్‌కం టాక్స్ సాధ్యమైనంతవరకు సక్రమముగా చెల్లించరు. ఇందులో నా స్వార్థమేముంది?

ఎంతమందికో (ఎక్కువ సినిమా యాక్టర్లకి) "పద్మశ్రీ"లు ఇస్తున్నప్పుడు, దేశానికి అనేక విధాల సాయపడుతున్న నాకు "పద్మశ్రీ" ఎందుకు బహూకరించకూడదు?

# విన్నపాలు

జి. నాగన్న

కూలినాలి చేతి నిండ
వెలితికాక కూటి కుండ
బిడ్డ పాపల కొఱతలేక
బ్రతుకు నిండుగ వున్న చాలు — చాలుస్వామి!

మేలు మిద్దెల సుద్దులేల?
మేలు మాకీ పూరి గుడిసె!
గుడిసెమీదా గుత్తగొనక
గొడవ సేసి పీకమనక
ఉన్నచాలు — చాలుస్వామి!

ఉల్లి ఉప్పు మిరపకాయలే
ఎల్లవేళల రుసులు మాకు
చాలిచాలని సంకటైన
వేళకింత గంజియైన
ఉన్నచాలు — చాలుస్వామి!

పిల్లజెల్ల చల్లగుంటే
ఇల్లువాకిలి వెచ్చగుంటే
నగనట్ర నేను పెట్టినంత
సరిగంచు కోకలు కట్టినంత
మరి–తినకనే తిన్నంతస్వామి!

కష్టమంతా కల్లుసారా
ఇష్టమొచ్చి నటుల తాను
తప్పతాగి తిట్టకున్న
తిప్పలెట్టి కొట్టకున్న
మొరటుగా తానున్న నేమి? చాలు స్వామి!

తాను చల్లగ కొల్లగుంటే
నెనరు నాపై తరుగకుంటే
బిడ్డపాపల కొఱతలేక
బ్రతుకు నిండుగ వున్న చాలు చాలు స్వామి
విన్నపాలిక లేవు స్వామి!